# కావాలెను

వడ్డి ఓం ప్రకాశ్ నారాయణ్

రాత్రి రెండు గంటలకు సిటీ ఎడిషన్ పూర్తి చేసి, రూమ్‌కి చేరేసరికీ వెంకటేశం గడగడా వణికిపోతూ, హనుమాన్ చాలీసా బిగ్గరగా చదివేసుకుంటూ కనిపించాడు. కాసిని మంచినీళ్ళు తాగాలన్న కోరికను బలవంతాన వాయిదా వేసుకుని చెప్పులు పక్కన పడేసి హడావుడిగా వాడి దగ్గరకెళ్ళి 'ఏమైంద'ని అడిగాను.

'పెద్ద పీడకలొచ్చిందన్నయ్యా!' అన్నాడు వాడు. గొంతులో గాభరా ధ్వనిస్తోంది.



వాడి కుంభకర్ణుడి నిద్రను కూడా వదల గొట్టేంత గొప్ప పీడకల ఏమై ఉంటుందా? అనే అనుమానం వచ్చింది. ఎందుకంటే వాడు ఉద్యోగం వెతుక్కుంటూ హైదరాబాద్‌కు వచ్చి నెల రోజు లైంది. అప్పట్నుంచి వాడి వాలకం గమనిస్తూనే ఉన్నాను. రోజూ పొద్దునే తెలుగు, ఇంగ్లీషు పేపర్లను ముందేసుకుని కూర్చుంటాడు. కంపె నీలు, అందులో ఉన్న ఖాళీలు, తన క్వాలిఫికేషన్‌కు తగిన ఉద్యోగాలు... ఇలా ఓ లిస్ట్ తయారు చేసుకుని 'వాక్-ఇన్ ఇంటర్వ్యూ' అంటూ రోజూ సిటీలో ఏదో ఒక మూలకి వెళ్ళి వస్తుంటాడు.

'ఉద్యోగం ఏమైందిరా' అంటే 'తర్వాత ఫోన్ చేసి చెబుతాన'న్నారు అని సమాధానం చెబుతాడు.

సాయంత్రం అవ్వగానే ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్‌లో ఏదో ఒక సినిమా మొదటి ఆట చూసేసి, నా మెస్ కార్డు ఖాతాలో మీల్స్ చేసేసి, నేను నైట్ డ్యూటీ పూర్తిచేసుకుని వచ్చేసరికే హాయిగా పవళిస్తూ ఉంటాడు. డైలీ పేపర్‌లో సబ్ ఎడిటర్ ఉద్యోగం కారణంగా గతనెల రోజులుగా నైట్ డ్యూటీ చేసి వస్తున్న నాకు వాడి కుంభకర్ణుడి నిద్ర చూస్తే చిర్రెత్తుకొచ్చేది. కానీ ఇవాళ సీన్ రివర్స్ అయింది. హనుమాన్ చాలీసా జపిస్తూ, చెమటలు కక్కుతూ భయం భయంగా వాడు కూర్చున్న తీరు చూస్తే కాస్త జాలీ, కొంచెం ఆనందం కలిగాయి.

'ఇంతకీ కథేంటి... సారీ... కలేంటి?' అని అడిగాను.

'పీడకల అన్నాయ్' అన్నాడు.

'సరేలే! నిరుద్యోగులకు పీడకల కాకుండా పెళ్ళి కళ... సారీ పెళ్ళి కల వస్తుందేమిటీ' అన్నాను నిష్ఠూరంగా.

''అంటే నాకు ఉద్యోగం వచ్చినట్టు కలొచ్చింది' అన్నాడు.

'అది పీడ కల ఎందుకవుతుంది?' అన్నాను కొంచెం గొంతు పెంచి.

'కోప్పడకు. విషయం విను. ఓ పేపర్లో అసిస్టెంట్ మేనేజర్ కావలెను అనే ప్రకటన చూసి నా బయోడేటా మెయిల్ చేశాను. దానిని చూసి వాళ్ళు నా క్వాలిఫికేషన్స్ నచ్చి వెంటనే ఇంటర్వ్యూకి రమ్మన్నారు. వాళ్ళు చెప్పిన టైమ్‌కి నేను ఠంచన్‌గా వెళ్ళిపోయాను. నన్ను ఇంటర్వ్యూ చేసి, నా క్వాలిఫికేషన్ నచ్చి వెంటనే పది వేల జీతానికి నాకు ఉద్యోగం ఇచ్చేస్తామన్నారు. మర్నాడు వచ్చి చేరి పొమ్మనీ చెప్పేశారు'' ఊపిరి పీల్చుకోవడానికి వెంకటేశం కాసేపు ఆగాడు.

''మరి చేరిపోక పోయావా... '' అన్నాను వ్యంగ్యంగా.

''చేరేద్దామనే ఆ మర్నాడు వెళ్ళాను. అయితే అదే రోజు మీ పేపర్లోనే మొదటి పేజీలో బ్యానర్ ఐటమ్ ఒకటి వచ్చింది. నేను చేరాలనుకుంటున్న కంపెనీని ఆ యజమాని భూ కబ్జా చేసి కట్టాడట. మీ పత్రిక వాళ్ళే ఈ కుంభకోణాన్ని వెలికి తీశారు. చూస్తూ చూస్తూ కబ్జాదారుల కంపెనీలో ఎందుకు పనిచేయడం అని ఉద్యోగంలో చేరడానికి వెళ్ళ లేదు'' నిట్టూర్చాడు వెంకటేశం.

'అలాగా! మరి వేరే ఉద్యోగానికి ప్రయత్నించ లేదా?' అన్నాను కాస్త సానుభూతిని నటిస్తూ.

'చేశానన్నాయ్...' అన్నాడు వాడు సిన్సియర్‌గా. ''ఇక్కడ కూడా నా క్వాలిఫికేషన్ నచ్చి, వచ్చి చేరమని చెప్పారు. కానీ అక్కడా నాకు చుక్కెదురైంది'' అన్నాడు నీరసంగా.

''ఏమైందేమిటీ?'' అన్నాను వెటకారంగా.

''ఈ కంపెనీ గురించి కూడా నిన్నే పేపర్లో చెడుగా రాసేశారు. ఈ సాఫ్ట్‌వేర్ కంపెనీ పేదల పట్టా భూముల్ని చౌకగా కొనేసి, వేరే వాళ్ళకి భారీ మొత్తానికి అమ్మేసిందట. అలానే స్టాక్‌మార్కెట్‌లో కొన్ని కంపెనీల షేర్లను తక్కువ రేట్లకు కొనేసి, లేని మార్కెట్‌ను సృష్టించి, షేర్ల రేట్లను ఆకాశానికి పెంచేసి... ఆనక అమ్మేస్తోందట. ప్రజలను, ఇన్వెస్టర్లను ఇంత మోసం చేస్తున్న అలాంటి కంపెనీలో ఎలా చేరను? ఒకవేళ నేను చేరినా... ఆ కంపెనీ ఉసురుపోసుకుని చనిపోయిన పేద ప్రజలు, సామాన్య ఇన్వెస్టర్ల ఆత్మ నన్ను పీక్కు తింటుంది కదా! ఆ నెత్తుటి కూడుతో నేను కడుపు నిండా అన్నం ఎలా తినగలను? అందుకనే అక్కడ కూడా ఉద్యోగం చేయకూడదని నిర్ణయం తీసుకున్నాను. మన రాష్ట్ర రాజధానిలోని కంపెనీల కన్నింటికీ ఇంత ఘన చరిత్ర ఉన్న తర్వాత ఏ కంపెనీలో చేరాలన్నా భయం భయంగా ఉంది. ఏ బడుగు జీవుల సమాధుల మీద ఆ బహుళ అంతస్తుల భవంతులను ఈ కంపెనీలు కట్టాయో అర్థం కావడం లేదు. నేను తీసుకోబోయే జీతం పైసలు ఏ అన్నార్తుల కన్నీళ్ళ ప్రతి రూపమోననే సందేహం నన్ను అతలాకుతలం చేసేస్తోంది. ఇదే ఆలోచనతో నిద్రపోతుంటే... పెద్ద పెద్ద కంపెనీల వల్ల నష్టపోయిన వాళ్ళు, కంపెనీ లాకౌట్ల వల్ల రోడ్డున పడ్డవాళ్ళు వెకిలిగా నవ్వుతూ హేళన చేస్తూ నా చుట్టూ తిరుగుతున్నట్టుగా కలొచ్చిందన్నాయ్. అంతే లేచి కూర్చున్నాను. నా కసలు ఉద్యోగం వస్తుందంటావా అన్నాయ్'' అన్నాడు వాడు కన్నీళ్ళు తుడుచుకుంటూ. వెంకటేశంలో అంతటి కవితాత్మ ఉందని కానీ, వాడు ఉద్యోగం చేసే కంపెనీ పట్ల అంత నిబద్ధతతో ఆలోచిస్తాడని కానీ నేను ఊహించలేదు.

వాడి దీన వదనాన్ని చూసిన తర్వాత నేనూ ఆలోచనలో పడ్డాను. వాడిని ఏదో విధంగా సమాధానపర్చి, పడుకోమని చెప్పాను. కానీ నాకు మాత్రం ఆ తర్వాత నిద్రపట్టలేదు.

నిజంగానే ఇది జవాబులేని ప్రశ్న.

కాసేపు ఆలోచించాక నాకో సమాధానం దొరికింది.

నేను డిగ్రీ పూర్తి చేసిన కొత్తలో 'నమ్మకస్తుడైన ఉద్యోగి కావలెను' అని పత్రికల్లో ప్రకటనలు వస్తుండేవి.

ఇవాళ నమ్మకస్తులైన ఉద్యోగులు ఉన్నారు. అయితే ఎవరినీ దోచుకోని, మోసం చేయని నమ్మకమైన సంస్థలే కరువయ్యాయి. సో... 'అన్ని అర్హతలు కలిగిన ఓ మంచి ఉద్యోగి పనిచేయుటకు నీతి నిజాయితీ కలిగిన సంస్థ కావలెను' అని వెంకటేశం కోసం మా పత్రిక క్లాసిఫైడ్స్‌లో ఓ ప్రకటన ఇస్తే ఎలా ఉంటుంది!?

ఈ విషయమై రేపు మా అడ్వర్టయిజ్‌మెంట్ మేనేజర్‌తో మాట్లాడాలి - అనుకుంటూ నిద్రకు ఉపక్రమించాను.

★

